96 చోట్ల అగ్నిమాపక తనిఖీలు

ప్రమాదాలపై మాక్ డ్రిల్స్

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 96 ప్రాంతాల్లో అగ్నిమాపకశాఖ తనిఖీలు చేపట్టి, మాక్ డ్రిల్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించినట్టు ఆ శాఖ ఏడీజీ వై నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. వారం రోజుల్లో దవాఖానలు, పెట్రోల్ బంక్‌లు, అపార్ట్‌మెంట్లు, నివాస సముదాయాలు, వాణిజ్య భవనాలు, పాఠశాలలు, కళాశాలలు, మల్టీప్లెక్స్, మాల్స్, బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చినట్టు వివరించారు. వివిధ జిల్లాల్లో 16 బోట్లతో రెస్క్యూ టీమ్‌లు ప్రాక్టీస్ యథావిధిగా కొనసాగించాయని నాగిరెడ్డి వెల్లడించారు.

S No.	Gift	Winner Name	Coupon No.
1	32" టెలివిజన్	బి. తన్విక్	64304
2	మొబైల్	సుమలత	20556
3	మైక్రో ఓవెన్	గ్రీన్ యాపిల్ మెడి. సిస్టం	21216
4	గిఫ్ట్ వోచర్	జి. అజయ్ కుమార్	33891
5	గిఫ్ట్ వోచర్	టి. శ్రావణి	30992

ఆదివాసీల జీవితాల్లో 'నోబుల్' వెలుగులు

- 19 ఏండ్లుగా అడవిబిడ్డలకు శిక్షణ
- 19 వేల మందికి ఉపాధి, ఉద్యోగాలు
- ఇప్పటివరకూ 20 పైలట్ ప్రాజెక్టులు
- హైదరాబాద్‌లో 'నోబుల్ ఎడ్యుకేషనల్ సొసైటీ' మరో ప్రాజెక్టు

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఆదివాసీ బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తెలంగాణ సర్కారు సంక్షేమ పథకాలకు ఓ స్వచ్ఛంద సంస్థ తోడు నిలుస్తున్నది. మారుమూల ఆదివాసీ, గిరిజన, చెంచు తండాల్లో జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రజల ప్రత్యేక అవసరాలను తీరుస్తూ తెలంగాణ సర్కారు లక్ష్యాలను నెరవేర్చేందుకు 'నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ' సంస్థ కలిసి నడుస్తున్నది. 2005లో ఏర్పాటైన ఈ సంస్థ ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో ఆయా వర్గాల కోసం 20కి పైగా ప్రాజెక్టులను నిర్వహించింది. దాదాపు 19వేల మందికి పైగా నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో అనుసంధానంగా మెప్మా, డీఆర్డీవో, ఐటీడీఏ, సీపెడా, ఇగ్నో వంటి సంస్థల సహకారంతో ఆదివాసీలకు విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రవేశాలు కల్పించింది. 19 ఏండ్ల తన ప్రయాణాన్ని పూర్తిచేసుకొని, ఇప్పుడు హైదరాబాద్‌లో మరో ప్రాజెక్టును ప్రారంభించేందుకు సిద్ధమైంది.

సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చే కోర్సులు

నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ద్వారా అనేక రంగాల్లో శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ నిర్వాహకుడు బీ సురేశ్‌కుమార్ తెలిపారు. వీటిలో ముఖ్యంగా సెక్యూరిటీ, వనబంధు, కల్యాణయోజన, బీపీవో, నర్సింగ్, కాల్‌సెంటర్, టైలరింగ్, హాస్పిటాలిటీ, హ్యాండ్‌సెట్ రిపేరింగ్, కంప్యూటర్ ఆపరేటింగ్, బ్యూటీ పార్లర్, బ్యాంకింగ్ సెక్యూరిటీ, రిటైల్ మార్కెటింగ్, సీసీ కెమెరాల రిపేరింగ్ వంటి రంగాల్లో శిక్షణనిచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. సంస్థ శిక్షణలో దివ్యాంగులకు ప్రత్యేకమైన అవకాశాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిశా, తమిళనాడులోనూ సంస్థ కార్యకలాపాలను కొనసాగిస్తున్నదని చెప్పారు. కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులను కర్ణాటకలోని గౌరీబిందుపూర్, చిక్‌బళ్లాపూర్, బీదర్, గుల్బర్గా, బస్వకల్యాణ్, శివమొగ్గ, ఒడిశాలోని బలారిపూర్, బల్లార్షా వంటి ప్రాంతాల్లో 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేసిందని అన్నారు. 19 ఏండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఇదే స్ఫూర్తితో అక్టోబర్‌లో హైదరాబాద్ అంబర్‌పేట డివిజన్‌లో 40 మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు.

డిజిటల్ లిటరసీలో శిక్షణ

డిజిటల్ లిటరసీ కల్పనలో భాగంగా కరీంనగర్, నారాయణపేట, వరంగల్, హైదరాబాద్, మెదక్ జిల్లాల్లో లిటరసీ స్కూళ్లను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో 10 కంప్యూటర్ల చొప్పున ఏర్పాటు చేసి, ఇద్దరు శిక్షకులతో శిక్షణ ఇప్పించింది.

కేంద్ర మాజీమంత్రి కావూరి కుమార్తె అరెస్టు

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘటన
- రాజస్థాన్ పోలీసులకు అప్పగింత

శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న కావూరి శ్రీవాణి

శంషాబాద్ రూరల్/హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ఏపీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని పోలీసులు అరెస్టు చేశారు. దుబాయ్ వెళ్తున్న ఆమెను శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకొని, ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. గతంలో రాజస్థాన్‌లోని జైపూర్‌లో రోడ్డు కాంట్రాక్టు పనులు చేసిన శ్రీవాణి.. కపిల్‌సింగ్ అనే వ్యక్తి భూమిలో అనుమతి లేకుండా మట్టి తవ్వారని, భూమి యజమాని ఫిర్యాదు మేరకు 2016లో శ్రీవాణిపై కేసు నమోదైందని ఎస్సై సుమన్ వివరించారు. ఈ కేసులో శ్రీవాణి కోర్టుకు హాజరు కాకపోవడంతో రాజస్థాన్ పోలీసులు లుకౌట్ నోటీసు జారీచేశారు. దుబాయ్ వెళ్లేందుకు గురువారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఆమెను శుక్రవారం ఉదయం అరెస్టు చేసి, రాజస్థాన్ పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. శంషాబాద్‌కు వచ్చిన రాజస్థాన్ పోలీసులు స్థానిక ప్రభుత్వ దవాఖానలో శ్రీవాణికి వైద్యపరీక్షలు చేయించి రాజేంద్రనగర్ కోర్టుకు తరలించినట్టు చెప్పారు. కాగా, రాజస్థాన్‌లోని సదరు భూమి యజమానికి డబ్బు చెల్లించానని, అయినా తనపై తప్పుడు కేసు నమోదు చేశారని ఆరోపించారు.

బాబు క్వాష్ పిటిషన్ 17కు వాయిదా

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. వరుసగా రెండోరోజు శుక్రవారం ఈ పిటిషన్‌పై సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాదులు సాల్వే, సింఘ్వీ, సిద్దార్థ్ లూథ్రా వాదనలు వినిపించగా.. ప్రభుత్వం తరపున ముకుల్ రోహత్గీ వాదించారు. స్కిల్ స్కాంపై 2021లోనే ఎఫ్ ఐఆర్ నమోదైందని, 2021కు ముందు కేసు నమోదైందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని సిద్ధార్థ్ లూథ్రా చెప్పారు. ఫైబర్‌నెట్ కేసులో కూడా 17ఏ చట్టం వర్తిస్తుందని వాదించారు. ఆ వాదనలను సీఐడీ తరపు న్యాయవాది రోహత్గీ తప్పుపట్టారు. విచారణ 17కు వాయిదాపడింది.

అంగళ్లు కేసులో ముందస్తు బెయిల్

అంగళ్లు కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు ఊరటనిచ్చింది. లక్ష రూపాయల పూచీకత్తుతో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో చంద్రబాబు ఏ1 ముద్దాయిగా ఉన్నారు. బాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై గురువారమే వాదనలు జరిగాయి. కోర్టు తీర్పును రిజర్వులో ఉంచి శుక్రవారం వెలువరించింది. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి'పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబుతో పాటు ఆ పార్టీకి చెందిన 179 మంది నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. హత్యాయత్నంతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. దీనిపై టీడీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించడంతో ..విచారణ చేపట్టిన ధర్మాసనం ఇప్పటికే రెండు పర్యాయాలు కొంత మందికి బెయిల్ మంజూరు చేసింది. కాగా, చంద్రబాబు ఆరోగ్యంపై ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.